# ఈనాటి బానిస చదువులకు

# ప్రత్యామ్నాయం గాయత్రీ విద్య



✦ గాయత్రీ మంత్ర జపము

గాయత్రీ మహా విజ్ఞాన్

✦ సంస్కార పరంపరలు

డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

# ఈనాటి బాలిన చదువరులకు ప్రశ్నోత్తరీయం గాయత్రీ విద్య

ఎడిటర్: పి. సీతారాముడు

శ్రీ సుభాను నామ సంవత్సరం,
చైత్ర కృష్ణ ఏకాదశి, ఆదివారం.
27.4.03.

వెల: రు.

సభ్యులకు తగ్గింపు వెల 1 రూ॥

ప్రతులకు:

పి. సీతారాముడు,
H/o. ఎస్. సత్యనారాయణరాజు,
8-3-5, ఆర్టీసీ డిపో వెనుక రోడ్,
భీమవరం - 534 203. ప.గో. జిల్లా.
✆ 08816 - 231755

డి.టి.పి. :
ఇంద్ర, భీమవరం.

పబ్లిషర్స్ :
విశ్వకర్మ పబ్లికేషన్స్, భీమవరం.

ప్రింటర్స్ :
సాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, భీమవరం.

# ఈనాటి బానిస చదువులకు ప్రత్యామ్నాయం గాయత్రీ విద్య

16.4.03 న చైత్ర పౌర్ణమి సందర్భంగా
శ్రీమతి మారెళ్ల విజయా విశ్వనాధ్‌గారి నేతృత్వంలో
గుంటూరు, సప్తఋషి ఆశ్రమంలో జరిగిన సాధనా
శిబిరంలో మాస్టరుగారు ఇచ్చిన ఉపన్యాసము.

ఒక అద్భుతమైనటువంటి కుట్ర
మన భారతీయ సంస్కృతి మీద పన్నబడింది.

బ్రిటిషర్స్ మన దేశాన్ని పాలించిన రోజులలో ఈనాటి విద్యా విధానాన్ని మన దేశంలో ప్రవేశపెట్టిన లార్డ్ మెకాలే అనే ఒక వైస్రాయ్ తన స్నేహితుడికి వ్రాసిన ఉత్తరంలోని సారాంశం,

- నువ్వేమీ గాభరా పడక్కర్లేదు, భారతజాతిని ఎక్కడ దెబ్బ కొట్టాలో నేను అక్కడ దెబ్బకొట్టాను.

  వాళ్ళు బానిసలుగానే బ్రతుకుతారు!

  పిచ్చివాళ్ళు, వాళ్ళకి స్వాతంత్ర్యం వచ్చిందని భ్రమిస్తున్నారు. వాళ్ళకి ఈ జీవితంలోనే కాదు, తరతరాల వరకూ కూడా వాళ్ళకి స్వాతంత్ర్యం రాదు. భావ దారిద్ర్యముతో బ్రతుకుతారు వాళ్ళు!



డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ, M.Sc., Ph.D.
సెల్ ఫోన్ నెం. 98491 11190

# ఒక సవాల్!

నేడు మానవజాతి మొత్తము ఒక విలక్షణమైన ఆంతరిక, బాహ్య పరిస్థితులలో చిక్కుకొని ఉన్నది. "బాహ్య పరిస్థితులన్నీ కూడా ఆంతరిక మనోభూమి యొక్క ప్రతిబింబాలే" అనేది మనము ఎంత తొందరగా అర్థం చేసుకుంటే అంత మంచిది. అన్ని చిక్కు పరిస్థితుల నుండి బయటపడటానికి ఈ సూత్రము ఉపయోగపడు తుంది. ఈ సూత్రము మీదే సంపూర్ణ ఆధ్యాత్మికత ఆధారపడివుంది.

ప్రస్తుత పరిస్థితులు మానవజాతికి ప్రకృతి ద్వారా ఇవ్వబడు తున్న ఒక సవాల్! ఎప్పుడూ సమర్థునికే సవాల్ ఇవ్వబడుతుంది. ఈ సవాల్ ప్రకృతి సంపూర్ణ మానవజాతికి ఇస్తున్నది కనుక మానవ జాతి మొత్తం దీనిని కలిసి స్వీకరించాలి. ఈ విషయం పరిపూర్ణమైన అవగాహనలోకి తెచ్చుకోవాలి.

రవాణా సౌకర్యాల వేగములో పెరుగుదల, కమ్యూనికేషన్స్ లోని తక్షణం అందజేయగల సామర్థ్యంలోని పెంపుదల (ఎస్.టి.డి., ఐ.ఎస్.డి., ఇంటర్నెట్) మొదలగు బాహ్య పరిస్థితులు, ఆంతరిక

# ఓం సాయి వెంకటేశ శ్రీరాం ఓం



దైవీ సంకల్పం



గురువుల ప్రేరణ



మానవజాతి ఆచరణ

పరిస్థితుల యొక్క ప్రతిబింబాలు అనే సూత్రానుసారం మానవజాతి ఒకే లక్ష్యము కొరకు సంఘటితమై పనిచేయవలసిన తరుణం ఆసన్నమైనదని తెలుపుతున్నాయి. మతాలు, ధర్మాలు, కులాల జోలికి వెళ్ళకుండా మానవజాతి సాధించవలసిన గమ్యమును ఐదు మాటలలో స్పష్టంగా ఏ విధమైన గందరగోళం లేకుండా నిర్వచించ వచ్చును. అదే ఒకే విశ్వం, ఒకే శక్తి, ఒకే ధర్మం, ఒకే భాష, ఒకే కరెన్సీ (ఒకే వినిమయ సాధనము)గా మనం గుర్తించాలి. ఈ పరిస్థితులు ఏర్పరచగలమా? ఈ సవాల్ స్వీకరించడానికి ప్రబల పురుషార్థము చేయగలవారికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది.



# సమర్పణ

1. కుమారి ఐ. జయశ్రీ,
   కుమారి ఐ. స్వాతీరశ్మి విశాఖపట్నం రు. 1,000-00

2. శ్రీ వి. సుబ్బారావు చీరాల రు. 1,000-00

---

" మేధ " మాసపత్రిక సౌజన్యంతో ఈ పుస్తకము
మేధ మాసపత్రిక మరియు విశ్వకర్మ పబ్లికేషన్స్ సభ్యులకు
40 శాతం తగ్గింపు వెలకు అందివ్వబడుచున్నది.

ఇవియన్నీ అడుగుచున్నవి, మీరేమి చేసినారని,
మనుషులుగా మీరేమి చేసినారని
- శ్రీ కె. పేరిశాస్త్రి, కామేపల్లి.

ఎంత నోము నోచినామో మేమని
తాము మనిషికన్న అంతో ఇంతో నయమని
పెదవి విప్పి పలికినవి కొన్ని, తమ మదిలోని మాటలను

వెదురులన్నవి తాము ఒడలు వంచి రామధనుస్సులైనామని ॥2॥
బండలన్నవి రామ పాదధూళిచే ప్రాణమొందినామని ॥2॥
పుడమి అన్నది భూజాతను కని కళ్యాణం చేసినానని ॥2॥

ఇవియన్నీ అడుగుచున్నవి, మీరేమి చేసినారని,
మనుషులుగా మీరేమి చేసినారని ॥ ఎంత నోము ॥

పడవలన్నవి రామభద్రుని మేం గంగను దాటించినామని ॥2॥
పాదుకలన్నవి పదునాలుగు వత్సరములు రాజ్యమేలినామని ॥2॥
పక్షులన్నవి ఆ పడతి జాడ ముందుగ మేం తెలిపినామని ॥2॥

ఇవియన్నీ అడుగుచున్నవి, మీరేమి చేసినారని
మనుషులుగా మీరేమి చేసినారని ॥ ఎంత నోము ॥

ఫలములన్నవి రామ పెదవికి మేం తీపిని అందించినామని ॥2॥
కోతులన్నవి కొండంత సాయం మాదేనని ॥2॥
ఉడతలన్నవి ఆ కడలికి వారధి సాయం చేసినామని ॥2॥

ఇవియన్నీ అడుగుచున్నవి, మీరేమి చేసినారని
మనుషులుగా మీరేమి చేసినారని ॥ ఎంత నోము ॥

ఓం ............... ఓం ............... ఓం ...............

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మః తస్మై శ్రీగురవేనమః

అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరమ్
యత్పదం దర్శితంయేన తస్మై శ్రీగురవేనమః

ఆయాతు వరదాదేవి అక్షరేబ్రహ్మవాదిని
గాయత్రీం ఛందసాంమాతా బ్రహ్మయోనిర్నమోస్తుతే

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

---

కాలచక్ర భ్రమణంలో ఇంకొక సంవత్సరం గడిచిపోయింది. క్రిందటి సంవత్సరం నుంచి ఒక విశేషమైనటువంటి కార్యక్రమాన్ని మొదలెట్టాం మనం.

**ఆ కార్యక్రమం ఏమిటంటే,**

ఏప్రిల్, మే, జూన్, ఈ మూడు నెలల పూర్ణిమలకి చాలా చాలా ప్రాముఖ్యత ఇవ్వటం నేర్చుకోవడం మొదలెట్టాం మనం.

❂ కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోండి, ఇవాళ నేను చెప్పబోయే విషయాలు మీరు జాగ్రత్తగా విని ఆచరిస్తే, మీరు ఆచరించి నటువంటి ఈ విషయాలు రాబోయే కొలది సంవత్సరాలలో యూనివర్సిటీలో పాఠ్యాంశములుగా ఉంటాయి.

అది జరుగుతుంది. ఇప్పుడు మీరు చేస్తారా, నేను చేస్తానా అన్నది మాత్రం నాకు తెలియదు. ఒకటి మాత్రం కచ్చితంగా నేను చెప్పగలిగేది ఏమిటంటే, ఈనాడు నేను మీ ముందు ఉంచుతోన్నటు వంటి జీవిత విధానము మీరు ఆచరించుకుంటూ పోతూవుంటే, రాబోయేటటువంటి కొద్ది సంవత్సరాలలో యూనివర్సిటీ ఉన్నత అధికారుల దగ్గర్నుంచి మీకు ఆహ్వానాలు వస్తాయి. అప్పుడు మీరు ఫోజులు కొట్టి మేము రాము అనొచ్చు. అప్పుడు వాళ్ళు మీ దగ్గరికి కార్లు, విమానాలు వేసుకుని వచ్చి మిమ్మల్ని బ్రతిమాలుకుని ఈ విషయాలు మీరు ప్రపంచానికి చెప్పండి అని అడుగుతారు.

**కానీ, అది ఎప్పుడు జరుగుతుంది అంటే,**

కేవలము ఒక కర్మకాండలాగ కాకుండా, ఎప్పుడో మనకి మూడ్ వచ్చినప్పుడు సమాజంలో అందరూ చేసుకునే పండుగలు లాగ కాకుండా, అసలు ఇదంతా ఎందుకు చేస్తున్నాము అనేటటు వంటి జ్ఞానముతో కనుక నేర్చుకుంటే, మీరు భవిష్యత్ ఋషులు అవుతారు. మీరు అది గుర్తుంచుకోండి.

**ఋషులు అనే పదాన్ని నేను ఎందుకు వాడుతున్నాను అంటే,**

సైన్స్‌లో ఉన్నటువంటి ఒక బలహీనత ఏమిటంటే, ఇంకొక సైంటిస్ట్ ముందుకు రావాలి అంటే, అంతకు ముందు చెప్పిన

సైంటిస్ట్ తప్పు చెప్పాడు అనాలి మీరు. నేను చదివినటువంటి సైన్స్ అది, మరి మీరు ఎలాంటి సైన్స్ చదువుతున్నారో నాకు తెలియదు. నేను సైన్స్ లెక్చరర్‌ని కనుక నాకు చాలా బాగా తెలుసు. సైన్స్‌లో మీరు ఒక పి.హెచ్.డీ. పొందాలి అంటే, ఒక డాక్టరేట్ పొందారు అంటే, దాని అర్థం ఏమిటంటే, మీరు ఎవరో చెప్పింది తప్పు అని చెప్పి ఉండాలి. అది ఒప్పు అన్నారనుకోండి, మీకు డిగ్రీ రాదు.

**కానీ ఋషుల యొక్క జీవితంలో ఉన్నటువంటి తమాషా ఏమిటంటే,**

ఆ ఋషి చెప్పింది ఒప్పు అవుతుంది, ఇంకొక ఋషి చెప్పిన ఒప్పులో ఈ ఋషి ఒప్పు కలిసిపోతుంది. మీకు అర్థమయిందో లేదో మళ్ళీ చెప్తున్నాను, జాగ్రత్తగా వినండి.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్యపూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

అనేటటువంటి ఋషి పరంపర మనది. మనకి అర్థం కావటంలేదు ఆ ఋషి పరంపర. అది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకుంటే, ఈ పూర్ణిమనాడే ఇది ఎందుకు చెప్తున్నానో కూడా మీకు అర్థమవుతుంది. **పూర్ణమదః పూర్ణమిదం,** అదీ పూర్ణమే, ఇదీ పూర్ణమే.

సైన్స్‌లో అలా అనలేం. డాల్టన్ చెప్పిందీ కరెక్ట్, నేల్స్ బోర్ చెప్పిందీ కరెక్ట్ అనలేం మనం. అన్నామనుకోండి పిచ్చివాళ్ళలాగ చూస్తారు. కానీ ఋషి చెప్పినటువంటి వాక్కులో గొప్పతనం ఏమిటంటే, **పూర్ణమదః పూర్ణమిదం** - అదీ పరిపూర్ణమే, ఇదీ పరిపూర్ణమే. **పూర్ణస్యపూర్ణమాదాయ** - ఆయన చెప్పినదంతా నువ్వు

తీసేసుకో, అయినా ఆ ఋషి దగ్గర అంతా అలాగే ఉంటుంది. **పూర్ణమేవావశిష్యతే** - ఇంక మిగిలింది ఏమిటంటే, పూర్ణమే.

- ఆ స్థాయి వ్యక్తులుగా మీరు మారబోతున్నారు. అది ఎంత గొప్ప స్థాయో **మీరు ఆలోచించుకోండి.**

సైంటిస్ట్‌లకి **ఎప్పుడూ** టెన్షనే. రేపు ఇంకొకడెవడో వచ్చి కచ్చితంగా వీడు చెప్పింది తప్పు అంటాడు, సైన్స్ అయితే అంతే. ఆధ్యాత్మికత అయితే అలాగ అనలేరు. తేడా అది.

మామూలు లెక్చరర్‌గా మాత్రమే కాకుండా, సైన్స్‌లో ఉన్నటువంటి లోతులు తెలుసుకోవటానికి ప్రయత్నం చేసినటువంటి విద్యార్థిగా, గ్యారంటీగా నేను చెప్పేది ఏమిటంటే,

సైన్స్ తన పని ముగించేసింది !

**ఇంక సైంటిస్ట్‌లు ప్రపంచానికి ఏమీ ఇవ్వలేరు !!**

- వాళ్ళు ఇవ్వగలిగినటువంటి యుద్ధాలు ఇచ్చేశారు.
  వాళ్ళు ఇవ్వగలిగినటువంటి యుద్ధ సామాగ్రి ఇచ్చేశారు.

మొన్న హైదరాబాద్ వెళ్ళినప్పుడు ట్రైన్ నుంచి ఇంటికి నన్ను రిసీవ్ చేసుకోవటానికి వచ్చిన వాళ్ళ కారులో నేను వస్తున్నాను. వస్తున్నప్పుడు ఇరాక్ వార్ ఎంత వరకు వచ్చింది, అమెరికా వాళ్ళు ఏమంటున్నారు అనే డిస్కషన్ వచ్చింది. అసలు ఎందుకు యుద్ధం జరిగిందో నాకు ఇప్పటికీ తెలియదు. పేపర్ వాళ్ళకి తెలుసునేమో నాకు తెలియదు, ఎందుకు వాళ్ళు కొట్టుకు చస్తున్నారో నాకు మాత్రం అర్థం కాలేదు.

"ఏమిటి మాస్టారు, మీరేదో ఆధ్యాత్మికత అంటారు, ఇదంటారు, ఈ మాత్రం మీకు తెలియదా?" అన్నాడు.

అదిగో ఆ వ్యక్తి ఇక్కడే ఉన్నాడు, అతనే. నుంచోవయ్యా పర్వాలేదు. (శ్రీ ఆంజనేయలు, హైదరాబాద్)

"మాస్టారూ, మీకు ఈ మాత్రం కూడా తెలియదా, ఎక్స్‌పైరీ డేట్స్ ఉంటాయి బాంబులకి. ఆ ఎక్స్‌పైరీ డేట్ అయిపోయే ముందు వేసేయ్యాలి వాటిని. మరి ఎవరి మీద వెయ్యాలి? అంచేత ఎక్కడో అక్కడ మనుష్యులందర్నీ ప్రక్కకి పంపించేసి అక్కడ వేసేస్తున్నారు. అసలు మీరు ఏం సైన్స్ చదివారు, ఆ మాత్రం తెలియదా?" అన్నాడు. తను నవ్వుతూ అన్నాడుకాని, నాకు మాత్రం అది నిజం అన్పించింది.

**సైన్స్ మనకి అందించింది ఏమిటంటే,**

**అనవసరమైనటువంటి సుఖాలు మనకు అందించింది.**

❄ చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. కొన్ని సుఖాలు మనకు అవసరం లేదు. కానీ ఆ సుఖాలే మన రోగాలకి కారణాలు అని మనకి అర్థమవటం లేదు.

అంచేత సైంటిస్ట్‌లు మనకి ఇచ్చిన అద్భుతమైనటువంటి వరాల్లో మొదటిది నేను చెప్పానుకదా, ఎక్స్‌పైరీ డేట్ గల బాంబులు. ఎక్స్‌పైరీ డేట్ గల బాంబులు వచ్చినప్పుడు ఏం చెయ్యాలి? ఎవరి మీదో ఒకరి మీద ఆ బాంబులు ప్రయోగిస్తూవుండాలి. ప్రయోగించాలి కనుక, నువ్వు కాకపోతే మీ అమ్మ నీరు ఎంగిలి చేసింది అని వేసెయ్యాలి.

తోడేలు - మేకపిల్ల కథ గుర్తుందికదా! నీళ్ళు త్రాగుతోన్న తోడేలు క్రిందన నీళ్ళు త్రాగుతోన్న ఒక మేకపిల్లని చూసి దాన్ని చంపుదాం అనుకుంది. ఆ మేకపిల్ల దగ్గరకి వెళ్ళి "నేను త్రాగుతోన్నటు వంటి నీళ్ళు నువ్వు ఎంగిలి చేశావ్, అంచేత నిన్ను చంపుతాను" అంది. "నేనెలా ఎంగిలి చేయగలను, నేను ప్రవాహానికి క్రిందన ఉన్నానుకదా, నువ్వే పైన ఉన్నావు. అంచేత నువ్వు ఎంగిలి చేసిన నీళ్ళు నేను త్రాగుతున్నాను" అంది మేకపిల్ల. "అయితే నువ్వు కాదులే, మీ అమ్మ ఎంగిలి చేసింది" అని చెప్పి చంపేసింది.

❄ కథలు మాత్రమే అనుకుంటున్నారు ఇవి, మన మానసిక స్థితి కూడా అలాగే తయారుచేసుకున్నాం మనం.

ఒక అద్భుతమైనటువంటి కుట్ర
మన భారతీయ సంస్కృతి మీద పన్నబడింది.

ఒక వలలాగ విసిరారు.

❄ ఇక్కడ నేను రాజనీతిని తీసుకుని రావటంలేదు, ఒక పార్టీని వెనకేసుకుని రావటంలేదు. చరిత్రలో జరిగినటువంటి ఒక విశేషమైనటువంటి సత్యాన్ని అర్థం చేసుకోవటానికి మీరు ప్రయత్నించండి అని చెప్తున్నాను.

లార్డ్ మెకాలే అనేటటువంటి ఒక వైస్రాయ్, బ్రిటిషర్స్ మన దేశాన్ని పాలిస్తున్నటువంటి రోజులలో భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలి అని మన స్వాతంత్ర్య యోధులు అందరూ తీవ్రమైనటువంటి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు, గాంధీగారి యొక్క "అహింస" అనేటటు

వంటి విశేషమైనటువంటి "అస్త్రము" ద్వారా, చాలా జాగ్రత్తగా మీరు అర్థం చేసుకోండి. మీకు దీని గురించి ఇవాళ ఇంకా చెప్పబోతున్నాను నేను. అహింస అనేటటువంటి విశేషమైనటువంటి అస్త్రము ద్వారా రవి అస్తమించనటువంటి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఇంక వదిలేసి తీరాలి వాళ్ళు అనేటటువంటి స్థితికి తీసుకుని వచ్చినప్పుడు, ఒక స్నేహితుడుకి ఆ లార్డ్ మెకాలే ఉత్తరం వ్రాశాడు.[1]

- నువ్వేమీ గాభరా పడక్కర్లేదు, భారతజాతిని ఎక్కడ దెబ్బ కొట్టాలో నేను అక్కడ దెబ్బకొట్టాను.

  వాళ్ళు బానిసలుగానే బ్రతుకుతారు.

  పిచ్చివాళ్ళు, వాళ్ళకి స్వాతంత్ర్యం వచ్చిందని భ్రమిస్తున్నారు.

  వాళ్ళకి ఈ జీవితంలోనే కాదు, తరతరాల వరకూ కూడా వాళ్ళకి స్వాతంత్ర్యం రాదు. భావ దారిద్ర్యముతో బ్రతుకుతారు వాళ్ళు.

దెబ్బ అక్కడ తగిలింది.

అది మన తప్పుకాదు, మన సమాజము యొక్క తప్పుకాదు.

కానీ తెలిశాక దాన్ని సవరించుకోకపోవటం మూర్ఖత్వం.

## ఎక్కడ దెబ్బకొట్టారు వాళ్ళు?

మన సంస్కృతిని మర్చిపోవటానికి కావలసినటువంటి ప్రయత్నాలు అన్నీ చేశారు. మన సంస్కృతి మనకి తెలియదు.

---

1 - ఆధునిక విద్య అని మనం మురిసిపోతున్న ఈనాటి బానిసత్వపు విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి లార్డ్ మెకాలే.

ఆ సంస్కృతిని మళ్ళీ మనం అవగాహన చేసుకోవటానికి కావలసినటువంటి ప్రయత్నాలు అనేక మంది మహాత్ములు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తూవున్నా, అసలా సంస్కారవంతులము అవ్వాలి అని మనకి అవగాహన రావటంలేదు.

భారతీయ సంస్కారాలలో ఒకే ఒక సంస్కారం మిగిలి ఉంది ఈనాడు. పాణిగ్రహణ సంస్కారం, వివాహ సంస్కారం. ఆ సంస్కారము సక్రమంగా ఉన్నంత వరకు విడాకులు అనేవి మనకి లేవసలు, మనం ఊహించలేం అసలు. జరగదది. సీతారాములు కళ్యాణం మనకి ఆదర్శం. కానీ, ఎప్పుడైతే అగ్ని ముందు మనం చేసుకునేటటువంటి ఆ సంస్కారాన్ని మనం మర్చిపోయామో, దాని విలువ పోయింది.

అశ్వమేధ యజ్ఞానికి ప్రచారానికి వెళుతోన్నటువంటి రోజులలో మా కాలేజీలో ఒక సంఘటన జరిగింది. మా కాలేజీ హెడ్ దగ్గరకి ఆయన చిన్ననాటి స్నేహితుడు తన కూతురు పెళ్ళి కార్డు తీసుకుని వచ్చాడు. జాగ్రత్తగా వినండి, మనల్ని ఎంత క్రిందకి దిగజార్చిందో ఈ విద్యా విధానం మీకు అర్థమవుతుంది.

పెళ్ళి కార్డు తీసుకుని వచ్చాడు, మా హెడ్ దగ్గరకి. 'నువ్వు రావులే', కార్డు ఇవ్వటానికి వచ్చాడు, వస్తూ అన్న మాటలు జాగ్రత్తగా వినండి. ఇదే మాటలు మనమూ వాడతాం. అంచేత ఆయననే కాదు, మనమూ కార్డు ఇస్తాం, ఇస్తూ ఏం చెప్తాం మనం? నువ్వు రావులే! అంటే నువ్వు రావద్దు అని చెప్పటం ఏమో అని నా ఉద్దేశ్యం. 'ఇవ్వాలి కనుక, అలవాటు కనుక, మేము కార్డులు కొట్టించాం. నువ్వు వస్తావని

మాత్రం మేం అనుకోవటం లేదు.' సరే బాగానే ఉంది, అంత వరకు పెద్ద ప్రాబ్లం ఏం లేదు. ఎంచేతంటే, నిజంగానే చాలా మంది పెళ్ళిళ్ళకి వాటికి వెళ్ళటం లేదు.

ఇంకోటేం చెప్పాడు, రాత్రి ఒంటి గంటకి ముహూర్తం. అంత రాత్రి వరకూ మీరేం మెలకువగా ఉంటార్లే, అంచేత మీకు భోజనాలు తొందరగా పెట్టించే ఏర్పాట్లు చేస్తున్నాను అన్నాడు. అంటే ముందు భోజనాలు, భోజనాలు అయిపోయిన తరవాత రాత్రి ఎప్పుడో ఒంటి గంటకి పెళ్ళి. అంటే మా లెక్చరర్ స్నేహితుడు ఏమన్నాడు అంటే, "చూడు ఆ రోజు నాకు చాలా ముఖ్యమైనటువంటి పని ఉంది, ఏడున్నరకి నువ్వు భోజనం పెట్టెయ్యగలిగితేనే వస్తాను. లేకపోతే నేను రాను" అన్నాడు. లేదురా నువ్వు తప్పని సరిగా రా, నేను ఏడున్నరకే భోజనం పెడతాను."

సరే ఆయన వెళ్ళిపోయాక, ఈయనకి ఏంటబ్బా అంత ఘనకార్యం ఉంది అనుకున్నాను నేను. అంచేత అడిగాను. "ఏం లేదు, ఆ రోజు నేను సెకండ్ షోకి వెళ్ళాలి."

అప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన నేను అందరికీ చెప్పాను. ఎవరైనా ఆ ఆలోచన పాటిస్తే కనీసం ఆ ఆలోచన మొట్టమొదట నేను ఇచ్చాను అని చెప్పుకుందాము అని. నాకు ఏం ఆలోచన వచ్చిందంటే, రాబోయేటటువంటి రోజులలో పెళ్ళి కార్డు ఇవ్వరు, మీల్స్ టికెట్ ఇస్తారు. మీల్స్ టికెట్ ఇచ్చి బాబు మా వాళ్ళు పెళ్ళి చేసుకున్నారు. ఇదిగో ఫలానా హోటల్ మీల్స్ టికెట్ నీకు ఇస్తున్నాను, నీకు వీలున్నప్పుడు వెళ్ళి తినేసిరా. అంతేగా!

పిలిచింది కూతురి పెళ్ళికి. ఒంటిగంటకు ముహూర్తం. నువ్వు ఏడున్నరకు భోజనం పెడితే, ఆయన భోజనం చేసి సినిమాకు వెళ్తే అది చాలా కరెక్ట్ అనుకుంటున్నాం మనం. మరి ఏం సంస్కారం ఉంటుంది?

కానీ, ఆ పాణిగ్రహణ సంస్కారంలో ఉన్నటువంటి ఆ అద్భుతమైనటువంటి శక్తిని మీరు అర్థం చేసుకుంటే భారతీయ ఆధ్యాత్మికత యొక్క గొప్పతనం మీకు అర్థమవుతుంది.

అప్పుడు పూజ్య గురుదేవులు చేసేటటువంటి ఈ సంస్కార మహోత్సవాలు మీకు అర్థమౌతాయి. ఆ సంస్కార మహోత్సవాలలో గాయత్రీ యజ్ఞము ఎలా ఉపయోగపడుతుందో మీకు అర్థమౌతుంది.

ఒక పెళ్ళి కొడుకు, ఒక పెళ్ళి కూతురు. పరిచయాలు లేవు వాళ్ళకి. ఈమె వీళ్ళింట్లో పెరుగుతుంది, ఆయన ఆయనింట్లో పెరుగుతాడు. అంతేకదా! పెద్దలు కొంతమంది మాట్లాడుకుని, సరే బాబు మనకు కుటుంబాలు బాగానే నచ్చాయి, పెళ్ళి చేయించేద్దాం అనుకుంటారు. అంతకు ముందు వరకు ఒకళ్ళంటే ఒకళ్ళకు తెలీదసలు. ఫలానావాళ్ళు ఉన్నారు అని కూడా తెలీదు.

ఆ రెండు కుటుంబాలలో ఉన్నటువంటి స్త్రీ, పురుషులు ఒకానొక విశేషమైనటువంటి ముహూర్తంలో అగ్ని దేవుడు సమక్షంలో "మేము ఇద్దరము ఈ రోజు నుంచి భార్యభర్తలము" అని చెప్పించ బడుతున్నారు. అంతేకదా జరిగేది పెళ్ళిలో. కాని చెప్పబడిన తరవాత ఏం జరుగుతోందో అర్థం చేసుకోండి మీరు.

**ఏం జరుగుతోంది,**

ముక్కూ మొహం తెలియనటువంటి ఆ వ్యక్తులు బంధువులైపోతున్నారు. ఎన్నాళ్ళ వరకూ బంధువులౌతున్నారు? ఒక రోజా, రెండు రోజులా? ఆ బంధుత్వం ఎన్నాళ్ళుంటుంది? జీవితాంతం ఉంటుంది. కదా!

- సంస్కారం అంటే అర్థమౌతుందా, మీరు ఒకసారి సంస్కారంలో ప్రవేశిస్తే, అది జీవితాంతం ఉండాలి.

ఒక పెళ్ళిలో, పెళ్ళి కొడుకు యొక్క తమ్ముడు అమెరికాలో ఉన్నాడు. ఆ వీసాలు అవీ రాక పెళ్ళికి రాలేకపోయాడు. ఏదో ఓ అయిదేళ్ళ తరవాత వచ్చాడు. అప్పటికే అన్నకి ఒక పిల్లవాడు పుట్టున్నాడు, వాడికి నాలుగేళ్ళు వచ్చాయి. తమ్ముడు పెళ్ళికి రాలేదు, ఇప్పుడు ఇంటికి వచ్చాడు. ఇంతకీ ఆ నాలుగేళ్ళ కుర్రవాడు వాడికి బంధువు అవుతాడా, అవ్వడా? పెళ్ళికి రాలేదు కనుక లాభంలేదు, నీకూ నాకూ బంధుత్వం లేదు అంటామా?

- సంస్కారం అంటే ఇప్పుడు అర్థమైందా! సంస్కారంలో మీరు పాలుపంచుకున్నా, పంచుకోకపోయినా దాని ఫలితాలు అందరికీ వర్తిస్తాయి.

ఆ సంస్కారము దేనివల్ల వచ్చినది అంటే, అగ్ని ముందు తీసుకున్నటువంటి నిర్ణయాల వల్ల వచ్చింది మనకి.

- ఆ అగ్ని ముందు తీసుకునేటటువంటి నిర్ణయాలనే 'యజ్ఞము' అంటాం మనం.

- ❋ అగ్ని ముందు మీరు ఏం నిర్ణయం తీసుకున్నా మీకు ఫలితాలు వస్తాయి. మీకు ఆ ఫలితాలు జీవితాంతము వస్తాయి.
- ⇨ వర్షం కావాలి! అగ్ని ముందు మీరు ఆ నిర్ణయం తీసుకుని యజ్ఞం చేయండి, కచ్చితంగా వర్షం కురుస్తుంది.
- ⇨ పిల్లలు లేరు, అగ్ని ముందు ఆ నిర్ణయం తీసుకుని మీరు పుత్రకామేష్టి యజ్ఞం చేయండి, కచ్చితంగా పిల్లలు పుడతారు.

చార్మినార్! పేరు విన్నారుకదా! ఎక్కడుంది చార్మినార్? హమ్మయ్య, హైదరాబాద్‌లో. చార్మినార్‌ని ఎంత మంది చూశారు? చూశారుకదా? రైట్.

చార్మినార్ ఎందుకు కట్టారు?<br>
ఎంత మందికి తెలుసు? ఎందుకు కట్టారు?

మీరు చార్మినార్, ఇలాంటి ప్రదేశాలకు వెళ్ళినప్పుడు కాస్త అక్కడ వ్రాసున్నటువంటి మార్బుల్ స్టోన్స్ ఉంటాయి, శిలాఫలకాలు, అవి చూస్తే అసలు అది ఎందుకు కట్టారో మీకు తెలుస్తుంది.

- ⇨ హైదరాబాద్ నగరంలో 17 వ శతాబ్దంలో ప్లేగు వచ్చింది. ప్లేగు రాకుండా ఆపటానికి అప్పుడు కట్టారు. చార్మినార్ కట్టిన తరవాత ప్లేగు రాలేదు.
- ➡ అంత అద్భుతమైన వాస్తు జ్ఞానం ఉంది భారతదేశంలో.

ఇప్పుడు ఏదో న్యుమోనియా వస్తోందట ఎక్కడో, ముక్కులకి, వాటికీ గంతలు కట్టేసుకుని, టీవీలో చూస్తున్నాను నేను, నాకు

తెలియదు ఆ న్యుమోనియా ఎక్కడుందో. అది ఎలాగ ఆపాలో తెలియటం లేదు వాళ్ళకి. అంచేత ఆ దేశాలకి వెళ్ళిన వాళ్ళని పట్టుకుని బయటకి పంపిచేస్తున్నారు.

✤ వాస్తు, యజ్ఞకుండ నిర్మాణము, యజ్ఞము యొక్క స్వరూపం, ఇవన్నీ కూడా ప్లేగులాంటి అంటు రోగాలనే ఆపేయగలిగితే మనకి ఉన్నటువంటి చిన్న చిన్న సమస్యలను ఎందుకు తీర్చలేవవి?

**కానీ, ఆ విదేశీ అధ్యయనము యొక్క దెబ్బ ఎలాగ కొట్టింది అంటే,**

మన సంస్కృతిని, మన సంస్కారాలను నమ్మలేనటువంటి అతి హీనమైనటువంటి స్థితిలోకి మనం దిగజారిపోయాం.

చెప్తే మనకి నమ్మకం ఉండటం లేదు, తమాషా అది. వాళ్ళు అక్కడ చార్మినార్ కట్టి బాబూ ప్లేగు వస్తే ఇది కట్టటం వల్ల మేము బాగుపడ్డాము అని వాళ్ళు అక్కడ పెట్టుకుంటే,

మేము నమ్మం!

నమ్మకపోతే నష్టపోయేది ఎవడు? మనమే.

కానీ, సత్యాన్ని ఎక్కువ సేపు మీరు ఆపలేరు.

నేను కొలది రోజులలోనే ఈ విద్య యూనివర్సిటీస్‌లో బోధించబడుతుంది అని చెప్పటానికి కారణం మీరూ నేనూ కాదు.

♣ ఒకసారి ఎక్కడైనా సత్యం మీద నుంచి మూత తీయబడితే, ఇంక ఎవడో ఒకడు దాన్ని పట్టుకుంటాడు, గ్యారంటీ అది.

నువ్వూ నేనూ పట్టుకుంటే మనం అదృష్టవంతులం. మనం పట్టుకోకపోతే ఇంకొకడు అదృష్టవంతుడు అవుతాడు. దీనికి ఎప్పుడూ నేను ఒక ఉదాహరణ చెప్తాను.

గవర్నమెంట్ ఫలానా ఫలానా లక్షణాలు ఉన్నవాళ్ళకి ఉద్యోగం ఇస్తాను అంటుంది. అందరికీ ఇవ్వలేదుకదా! అంచేత ఏమంటుంది, ఫలానా లక్షణాలు ఉన్నవాళ్ళకి ఓ వంద మందికి ఉద్యోగం ఇస్తాను అంటుంది. ఆ ఉద్యోగ ప్రకటన పడ్డాక నేను చదువు మొదలెడతాను అన్నవాడికి ఆ ఉద్యోగం ఎలాగూ రాదు. అంతేకదా! కానీ ఇలాంటిది పడబోతోంది అని తెలిస్తే, చీఫ్ మినిస్టర్ దగ్గర మీ బంధువు ఉన్నాడనుకోండి, రెండు మూడు ఏళ్ళల్లో ఫలానా జ్ఞానం ఉన్నవాళ్ళకి ఉద్యోగాలు రాబోతున్నాయి అనే రహస్యం తెలిసింది అనుకోండి, అప్పుడు మీరు ఏం చేస్తారు? ఆ విద్య నేర్చుకుంటారు.

## ఎలా నేర్చుకుంటారు?

నెమ్మదిగా, తొందరేముందిలే అని నేర్చుకుంటారా, తొందరగా నేర్చుకుంటారా? తొందర తొందరగా నేర్చుకుంటారు.

తొందర తొందరగా నేర్చుకుంటూ, చాలా ఖాళీలు ఉన్నాయని తెలిసిందనుకోండి, అప్పుడు ఎవరికి నేర్పాలని కోరుకుంటారు? మీ బంధువులకి, మీకు తెలిసున్న వాళ్ళకి, "బాబూ ఇలాంటి ఉద్యోగాలు వస్తున్నాయి, ఇలాంటి పరిస్థితి రాబోతోంది. అంచేత మీరు కాస్త తొందరగా ఈ విద్య నేర్చేసుకోండి, చాలా ఖాళీలు వస్తాయట అప్పుడు" అని చెప్తారు.

గురువుల యొక్క ఆవేదన అది.

❋ గత 5000 సంవత్సరాలుగా ఈ విషయం నాశనం అవకుండా ప్రపంచానికి అందజేస్తోన్నటువంటి గురువులు ఇక అతి కొద్ది సంవత్సరాలలో ఈ ఉద్యోగాలు రాబోతున్నాయి అని అర్థమై పోయింది వాళ్ళకి.

***ఎంచేత?***

వాళ్ళు గవర్నమెంట్‌లో ఉన్నారు కనుక.

***అంచేత ఏం చేస్తారు, ఎవరికి చెప్తారు వాళ్ళు?***

బయటవాళ్ళకి చెప్పటం లేదు వాళ్ళు. మీరు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. వాళ్ళు చాలా తెలివైనవాళ్లు. బయటవాళ్లకి ఎవరికీ చెప్పటంలేదు.

✤ ఋణానుబంధంతో, కర్మ సంబంధంతో వాళ్ళకి దగ్గరగా ఉన్న వాళ్ళకి మాత్రమే అనేక రకాల సంస్థలలో చెప్తున్నారు. అటువంటి వ్యక్తులకే ఈ విషయం చెప్పబడుతోంది.

దానికి ఏ విధంగా అయితే ట్రైనింగ్ ఇండస్ట్రీస్, ఐ.టి.ఐ.లు అవీ పెట్టబడుతున్నాయో అలాగ ఆధ్యాత్మిక సంస్థలు ఏర్పడ్డాయి.

⇨ మీరు ఏ ఆధ్యాత్మిక సంస్థలో అయినా ఉండండి, మీకు ఆ పోస్ట్ వచ్చే గ్యారంటీ ఉంది.

***ఏ పోస్ట్ అని చెప్తానో మీకు గుర్తుందా?***

మీరు అందరూ కూడా ఋషుల స్థానాన్ని ఆక్రమించాలి.

ఇప్పుడు ఎడ్యుకేషన్‌లో అందరూ ప్రొఫెసర్‌లు అయిపోవాలని ఎలా కోరుకుంటామో, అలాగ మనమందరం కూడా ఋషులం అయిపోవాలి.

⇨ కానీ అసలు మనమందరమూ కూడా ఆ ఋషి సంతతి అని మర్చిపోయాం.

➡ ఈ ఋషి సంతతి అనే పదము కేవలము భారతీయులు మాత్రమే ఉపయోగించుకోగలరు. అది గుర్తు చేసుకోండి. గోత్రాలు మీకే ఉన్నాయి. ఇంక ఎవరికీ గోత్రాలేం లేవు.

## గోత్రాలు అంటే ఏమిటి?

ఋషుల పేర్లు.

♠ అంచేత మొత్తము ప్రపంచంలో భారతదేశంలో మాత్రమే ఋషులు, గురువులు ఊహించుకునేటటువంటి ఆ దివ్యమైనటువంటి విద్యకి అర్హత కలిగినటువంటి ఋషి సంతతి ఉంది.

ఈ ఋషి సంతతి ఉంది, ఈ ఋషి సంతతికి ఈ జ్ఞానం ఇవ్వాలి అని ఘంటాపథంగా నొక్కి చెప్పినటువంటి ఏకైక గురువు ఎవరు అంటే,

**పండిత శ్రీరామశర్మ ఆచార్య**

మిగతా గురువులు అందరూ ఈ పనే చెప్పారు, చాటుమాటుగా చెప్పుకున్నారు. వాళ్ళ వాళ్ళకే చెప్పుకున్నారు. తప్పేం లేదు కదా, ఉద్యోగాలు అవీ వచ్చినప్పుడు ఎప్పుడూ అంతేకదా!

**కానీ ఈయనకి దమ్మేంటి అంటే,**

"నా వాళ్ళకి తప్ప, మిగతా వాళ్ళకి ఆ పోస్ట్‌లు రావు."

**ఎందుకు రావు?**

"నా జీవితము, నా వారసత్వము అనేది నేను ఎంత స్పష్టంగా మా వాళ్ళకి చెప్పానో, అంత స్పష్టంగా మిగతా గురువులు ఎవరూ ఏమీ చెప్పలేదు."

- అరవిందో సొసైటీలో చాలా లోతుగా తరచి ఆయన పుస్తకాలు చదివాను నేను.
- వివేకానంద మిషన్, రామకృష్ణ పరమహంస పుస్తకాలు చాలా లోతుగా చదివాను, చదువుతున్నాను.
- సీక్రెట్ డాక్ట్రిన్ వ్రాసినటువంటి బ్లావెట్స్కీ మరియు థియొసాఫికల్ సొసైటీ యొక్క ఆధ్వర్యములో వ్రాయబడిన పుస్తకాలు అన్నీ చదివాను నేను.
- భారతదేశంలో ఏ గురుపరంపర ఉన్నా, ఆ గురుపరంపర గురించి చాలా తీవ్రంగా సాధనాత్మకంగా అధ్యయనం చేశాను.

ఏ గురువూ కూడా రాబోయేటటువంటి కాలంలో ఇలాంటి మార్పులు రాబోతున్నాయి, మీరు ఇలాగ ఉంటే, రాబోయేటటు వంటి వాళ్ళకి మీరు మార్గదర్శకులుగా ఉంటారు, యుగసైనికులుగా ఉంటారు అని శ్రీరామశర్మ ఆచార్య చెప్పినంత స్పష్టంగా ఇంకెవ్వరూ చెప్పలేదు. యుగసైనికులు, ఆయన వాడినటువంటి పదము అది.

## సైనికులు అంటే ఏమిటి?

శాసించేవాళ్ళు. వాడు చెప్పింది అందరూ చెయ్యాలితప్ప, సైనికుడు ఎవడి మాటా వినడు.

- "యుగసైనికులు" అంటే ఆ పదంలో ఉన్నటువంటి తీవ్రత మీకు అర్థమవటంలేదు.

మీరు చెప్పింది ప్రపంచం చెయ్యాలి తప్ప, ప్రపంచం మిమ్మల్ని శాసించలేదు అని అంత ఘంటాపథంగా చెప్పినటువంటి ఆ గురువు యొక్క శిష్యులుగా మనగలుగుతోన్నటువంటి మనము ఒక చిన్న తప్పు చేస్తున్నాం అంతే.

### కాలాన్ని వృథా చేస్తున్నాం.

మిగతాదంతా చాలా కరెక్ట్‌గానే ఉంది. చాలా గొప్ప గురువు యొక్క శిష్యులమే మనము. చాలా స్పష్టంగా ఏమి చెయ్యాలో మనకి తెలుసు. కానీ ఒక కథ గుర్తుంచుకోండి, కుందేలు, తాబేలు.

మనకి తెలిసిపోయింది కనుక, ఆ ఏముందిలే, ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి చేస్తాము అనుకుని మీరు పడుకుంటే, తాబేలు నడకన నడుస్తున్నటువంటి విదేశీయులు, వాళ్ళు ఋషి సంతతి కాదు! వాళ్ళకి మన భారతదేశంలో ఉన్నటువంటి సంస్కారాలు లేవు. కానీ తాబేలు నడకన నడుస్తున్నారు వాళ్ళు. మెల్లిమెల్లిగా, మెల్లిమెల్లిగా భారతీయ సంస్కృతిలో ఉన్నటువంటి వజ్రాలను వాళ్ళు అర్థం చేసుకుంటున్నారు, కానీ అది వజ్రం అని ఇంకా తెలియటంలేదు వాళ్ళకి.

**వాళ్ళకి తెలుస్తోంది ఏమిటంటే,**

ఇది భలే మెరుస్తోందిలే, భలే బాగుందిలే అనే అనుకుంటున్నారు తప్ప, దీని ద్వారా మనం ఏ స్థితికి వెళ్ళవచ్చు అన్నది ఇంకా వాళ్ళకి తెలియదు. మనకి మాత్రం కచ్చితంగా తెలుసు.

- మనకి కచ్చితంగా తెలిసినా, ఆ తెలిసినటువంటి విధానము వైపుకి మనం వెళ్ళటంలేదు. అదీ మనం చేస్తోన్న తప్పు.

అంచేత ఆ ఋషి మార్గంలో మనం వెళ్ళటానికి కావలసినటువంటి ఒక విధానం మనం ఇప్పుడు నేర్చుకున్నాం మనం,

యజ్ఞ విధానము.

సహ యజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వమేషవోఽస్త్విష్ట కామధుక్.     (భ.గీ. 3-10)

పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతోగూడ ప్రజలను సృష్టించి 'ఈ యజ్ఞములచే మీరభివృద్ధిబొందుడు. ఇవి మీ అభీష్టములను నెరవేర్చుగాక!' అని వారితో బలికెను.

మీ కోరికలు తీరాలి అంటే మీరు చదువుకోవక్కర్లేదు. అది చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి.

- మనకి ఒక విచిత్రమైనటువంటి రోగం అంటుకుంది.
  చదువుకుంటే తప్ప,
  ఉద్యోగం వస్తే తప్ప మనం బ్రతకలేము అని.

**అది ఎలా మాన్పించాలో నాకు అర్థం కావటంలేదు.**

☞ పూర్వకాలంలో, విదేశీయులు మన మీద ఆక్రమణ చేయక ముందు నాకు తెలిసి భారతదేశంలో ఉద్యోగాలు ఏం లేవు.

ఉన్నాయా ఏమైనా?

**ఏం ఉండివుంటాయి?**

కుమ్మరి, కమ్మరి, కంసాలి, ఇలాగ ఐ.టి.ఐ.లు ఉన్నాయి కాని, ఉద్యోగాలు ఏమీ లేవు. వాళ్ళు అందులో ట్రైనింగ్ అయి, తమ వృత్తి తాము చేసుకుంటూ స్వతంత్రంగా బ్రతికేవాళ్ళు. ప్రజలు ఆ విధంగా బ్రతికేటప్పుడు మనదేశం రత్నగర్భ అని పిలవబడేది.

మీరు ఒక విషయాన్ని ఆలోచించండి. పూర్వకాలంలో విదేశీయులు మనదేశానికి రావాలంటే, మామూలు పడవ మీద రావాలి. పడవ మీద బయలుదేరితే మనిషి చేరుకుంటాడో, లేదో తెలియదు, హిమాలయాల వైపు నుంచి రావాలి అంటే చలి. మార్గం కరెక్ట్‌గా తెలియదు. అయినా,

⇨ భారతదేశంలో ఇంత సంపద ఉన్నది అని విదేశీయులకి ఎలా తెలిసింది అని మీకు అనుమానం రావటం లేదా? నా ప్రశ్న అర్థమయిందా కనీసం మీకు? అది కూడా అర్థం కాలేదా?

మన మీదకి విదేశీ ఆక్రమణలు జరిగాయి. అంత వరకూ తెలుసా? ఆక్రమణ ఎవడి మీద చేస్తాడు? ఓ పూరిగుడిసెలో చచ్చి పోవటానికి రెడీగా ఉన్నటువంటి ఒక బీదవాడు ఉన్నాడనుకోండి, వాడి మీద బాంబులు వేస్తామా? ఎవడి మీద వేస్తాం బాంబులు? ........ అంతేకదా!

⇨ ఆ కాలంలో ఇప్పుడున్నటువంటి ప్రయాణ సౌకర్యాలుకాని, ఇప్పుడున్నటువంటి కమ్యూనికేషన్ సిస్టమ్స్‌కాని లేవు. లేకపోయినా, భారతదేశంలో ఇంత సంపద ఉన్నది, దానిని కొల్లగొట్టవచ్చును అని వాళ్ళకి ఎలా తెలిసింది?

☝ ఆ ప్రశ్నని కనుక మీరు సాల్వ్ చేసుకోగలిగితే మీరు ఈ ఉద్యోగాల వేటలో పడరు. ఈ ఉద్యోగాలు ఇచ్చేటటువంటి చదువుల వెనకాతల పడరు.

**"మీరు ఎప్పుడూ తిడుతూవుంటారు మమ్మల్ని, మరి ఇంతకీ మా పిల్లల్ని చదివించాలా, వద్దా మాస్టారు?"**

శ్రీరామశర్మ ఆచార్య ఇచ్చిన జవాబే నేనూ ఇవ్వగలను. 1949లో, అఖండజ్యోతి పెట్టిన మొదటి సంవత్సరాలలో ఇదే ప్రశ్న ఒక అఖండజ్యోతి పాఠకుడు అడిగాడు గురువుగారిని. ఇప్పుడు నేను చెప్పినట్టే ఆయనా చెప్తుండేవారు అఖండజ్యోతిలో, ఇదంతా వేస్ట్, ఇదంతా చెయ్యొద్దు అని. మరి మా కుర్రాడిని చదివించాలా, వద్దా? అన్నాడు.

దానికి ఆయన ఇచ్చిన జవాబు ఈనాడూ మీకు వర్తిస్తుంది.

**ఆల్టర్‌నేటివ్ రానంత వరకు మీరు ఆ చదువు చదవాల్సిందే.**

అంతేకదా! ప్రత్యామ్నాయం ఉండాలికదా!

**ఆ ప్రత్యామ్నాయం ఎవడిస్తాడు మీకు?**

అది రాకుండా చేసే ప్రయత్నం చేసినటువంటి వాళ్ళు మీకు ఇవ్వరది.

**మరి ఆ ప్రత్యామ్నాయం ఎవరు చేసుకోవాలి?**

మనం తెచ్చుకోవాలి.

మనంతట మనం కష్టపడాలి.

- కానీ, ఆ ప్రత్యామ్నాయ మార్గము మీరు వెదుక్కోవక్కర్లేదు. రెడీమేడ్‌గా వేసి ఉన్నది.

**ఏమని చెప్పి ఉంది?**

- గాయత్రీ మంత్రాన్ని కనుక మీరు ఉపయోగించుకోగలిగితే, సర్వ శాస్త్రాల రహస్యాలు, సర్వ వేదాల రహస్యాలు తెలుస్తాయి. భారతీయ ఆధ్యాత్మికత యొక్క మొత్తము రహస్యము గాయత్రీ మంత్రములో ఉన్నది.

దాన్ని వదిలేస్తాం మనం. అది తప్ప అన్నీ చేస్తాం. తమాషా చూడండి. చాలామంది నన్ను అడుగుతూవుంటారు, "మాస్టారు, మీరు ఈ మంత్రం చెప్తారు, ఆ మంత్రం చెప్తారు, అయితే గాయత్రీని వదిలేసేదా?" అని.

నాకు నా మీద చాలా జాలి వేస్తూవుంటుంది. ఈ మధ్య చాలా జాలిపడిపోతున్నాను. నా మీద మీరు జాలి చూపించరు కదా! అంచేత నేనే నా మీద జాలిపడిపోతూ ఉంటాను. అసలు నేను ఏం చెప్పాను 22 ఏళ్ళు వీళ్ళకి, వీళ్ళు ఏం అర్థం చేసుకున్నారు అని. గాయత్రీ మంత్రంతో పాటు మిగతావి చెయ్యాలి.

ఒక ఫంక్షన్‌కి విందు భోజనానికి పిలిచారు. పిండివంటలు, రకరకాలైనటువంటి వంటకాలు అవంతా చెయ్యాలి అని తల్లి

కూతురుకి చెప్పింది. సరే కూతురు రకరకాలైనటువంటి కూరలు చేయించేసింది, రకరకాలైనటువంటి పులుసులు చేయించేసింది, రకరకాలైనటువంటి వంటకాలు అన్నీ చేయించేసింది. సరే తల్లి వచ్చి ఏం చేశావు అంటే, నువ్వు చెప్పావుకదమ్మా ఒక కూర చెయ్యమని, నేను ఐదు కూరలు చెయించాను. నువ్వు రెండు పచ్చళ్లు చెయ్యమంటే నేను పది పచ్చళ్లు చేయించేశాను.

ఇంక బ్రహ్మానందం పడిపోయింది తల్లి. "అబ్బ! కూతురు అంటే ఇలాంటి కూతురు ఉండాలి. ఎంత కష్టపడిందో పాపం. మన వాళ్ళు అందరూ భోజనానికి వచ్చినప్పుడు చెప్పాలి!" సరే భోజనానికి వచ్చారు. వడ్డన మొదలైంది, ఐదు కూరలు వడ్డించారు, పచ్చళ్ళు వేసేశారు, అన్నం రావటంలేదు ఎప్పటికీ. ఎలా ఉంటుందది విందు భోజనం? గాయత్రీ మంత్రము లేని సాధన అలాగే ఉంటుంది.

కానీ గాయత్రీ మంత్రం చేసుకో అని ఎవడూ చెప్పడు. విందు భోజనం చేస్తున్నాం అంటే అన్నం వండాలని ఎవడూ చెప్పడు. అది కామన్. దానితో పాటు, మామూలుగా మనం చేసుకునే అన్నంతో పాటు మిగతావి రావాలి. అంచేత చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

❁ రాబోయేటటువంటి రోజులలో విశేషమైనటువంటి వ్యక్తిత్వం కలిగినటువంటి వ్యక్తులుగా, స్త్రీలుగా మీరు గుర్తింపుపొందాలి అంటే, మీరు గాయత్రీ సాధకులు అయితీరవలసినదే!

ప్లస్ ఎక్స్ట్రా ఉంటే, అది యాడెడ్ క్వాలిఫికేషన్. ఎక్స్ట్రా ఉంటే, యాడెడ్ క్వాలిఫికేషన్ ఎప్పుడైనా మంచిదేకదా. అది ముందు ఈ పూర్ణిమనాడు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి.

⇨ ప్రతీ ఇంట్లో కూడా గాయత్రీ సాధన చేస్తూవున్నటువంటి వ్యక్తులు ఉండాలి.

ఆ కుటుంబంలో ఒకడు చేస్తున్నాడండి, ఇంటికి పెద్ద అంటే మీకు అర్థం కాలేదు నేను చెప్పింది. ప్రతీ ఇంట్లో కూడా గాయత్రీ మంత్ర సాధకులు ఉండాలి.

ఆ గాయత్రీ మంత్ర సాధనతో పాటు నేను చెప్పిన ఇతర సాధనలు కలుపుకోవాలి తప్ప, ఒకటి చెప్తే ఒకటి వదిలేస్తారు తమాషా ఏమిటో. మూడవ ఎక్కం నేర్చుకున్న తరవాత నాలుగో ఎక్కం నేర్చుకుంటే, మూడవ ఎక్కం మర్చిపోయాను అంటే ఎట్టా? మూడవ ఎక్కం గుర్తుంచుకుని నాలుగవ ఎక్కం ఉండాలి. నాలుగవ ఎక్కం గుర్తుంచుకుంటూ ఐదవ ఎక్కానికి రావాలి.

✦ కానీ, గాయత్రీ మంత్ర జపము మాత్రమే ఇంక సరిపోదు. గాయత్రీ మంత్రంలో ఉన్నటువంటి విశేష అర్థాలు మనకి తెలియాలి.

అంచేతే చాలా స్పష్టంగా చాలా మందిని ఈ కేంప్‌కి రమ్మని అడిగాను నేను. మీలో ప్రతీ ఒక్కరూ కూడా నేను చెప్పినటువంటి ఈ విషయాలు మీరు పాటించుకుంటూ అనేకమంది చేత పాటించే టటువంటి ప్రయత్నం చేయండి. మీకున్నటువంటి పరిస్థితులు బట్టి దాన్ని ఎలాగ ఆర్గనైజ్ చేస్తే బాగుంటుంది అన్నది మీకు వదిలేస్తు న్నాను. కానీ వదిలేస్తున్నాను అంటే, అసలు మీరు వదిలేస్తున్నారు. నాకు పెద్ద బాధ అది. అంచేత వదలను, మీరు ఏం ప్రణాళికలు వేశారో దీపయజ్ఞం తరవాత ఇవాళ సాయంత్రం మీరు నాకు చెప్పాలి.

☞ గాయత్రీ మంత్రముతో పాటు గురుదేవులు వ్రాసినటువంటి గాయత్రీ మహా విజ్ఞాన్ 3 పుస్తకాలు ఉన్నాయి. నెక్స్ట్ ఇయర్‌కి ఆ మూడు పుస్తకాలలో మీరు నిష్ణాతులు అవ్వాలి. థీరీ అయినా కనీసము. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

"మాకు భాష రాదు మాస్టారు!"

భాష రావక్కర్లేదు. అది చదివి చెప్పగలిగే వాళ్ళుంటే, ఆ సబ్జెక్ట్ మీరు నేర్చుకుంటే చాలు.

అక్బర్‌లాంటి మహాచక్రవర్తికి చదువు రాదు.

శివాజీకి చదువు రాదు.

కామరాజ్ నాడార్‌కి చదువురాదు.

పండిత శ్రీరామశర్మ ఆచార్య నాకు తెలిసి యూనివర్శిటీలో కాని, ఎక్కడా కానీ చదువుకోలేదు.

చాలామంది గురువులు అందరూ వేలిముద్రగాళ్ళే.

కాని సబ్జెక్ట్ వచ్చు వాళ్ళకి.

ఉపనిషత్స్‌లో చెప్పింది, మిగతా వాటిలో చెప్పింది వాళ్ళు చాలా బాగా చెప్పగలరు, ప్రాక్టికల్‌గా వాళ్ళు చాలా చెయ్యగలరు.

☞ అంచేత నా పరివార్ వాళ్ళందరికి, నావాళ్ళు అనుకునేటటు వంటి వాళ్ళకి, ఇది నా శాసనంగా మీరు స్వీకరించి గాయత్రీ మంత్ర జపమే కాదు, గాయత్రీ మహా విజ్ఞాన్‌లో పూర్తిగా పరిపూర్ణమైనటువంటి అథారిటీగా మీరు తయారవ్వాలి.

⇨ గాయత్రీ మహావిజ్ఞాన్‌లో నిష్ణాతుడైనటువంటి వ్యక్తికి ఏ విధమైనటువంటి లోటు ప్రపంచంలో ఉండదు.

మీరు చేసి చూడండి. అనేక పిచ్చి పిచ్చి పన్లన్నీ చేస్తూ వుంటారు కదా, అలా చేస్తే అదవుతుంది, ఇలా చేస్తే ఇదవుతుందని. అలాగే గాయత్రీ మహా విజ్ఞాన్ 3 భాగాలు మథించి చూడండి.

'చెప్పామండి చాలా మందికి, చదవలేదండి' అని చెప్పకండి.

**ముందు మీరు చదవండి.**

భలే దొరుకుతారు అందరు. "మీరు చెప్పమన్నారు కదా మాస్టారు, నేను ఎంతమందికో చెప్పాను, చేయలేదు!"

పోనీ నువ్వు చేసావా?

"మమ్మల్ని చెయ్యమని ఎక్కడన్నారు, మీరు చెప్పమన్నారు కదా!" కాదు, మిమ్మల్ని కూడా చదవమంటున్నాను, ముందు మీరు నిష్ణాతులు కండి.

✦ మీకు అందులో విపరీతమైనటువంటి జ్ఞానం వస్తే, గాయత్రీ మంత్రశక్తి ఉన్నవాళ్ళ చోట ఆటంబాంబు పేలదు.

స్కైలాబ్, సంవత్సరం నాకు గుర్తులేదు కాని భారతదేశం మీద పడుతుందని, ఎక్కడ పడుతుందన్నారో నాకు గుర్తులేదు కాని గ్యారంటీగా ఇండియా మీదే పడుతుందని సైంటిస్ట్‌లందరూ ఏక కంఠంతో చెప్పారు. మధ్యప్రదేశ్‌లోనో ఎక్కడో.

కాలిక్యులేట్ చేశారు, వాళ్ళ లెక్కలు తప్పు కాదు. కాని

వాళ్ళ లెక్కలలో గాయత్రీ మంత్రంలేదు వచ్చిన గొడవ అది. అప్పుడు గురుదేవులు బ్రతికే ఉన్నారు. కొంతమంది గురుదేవులు దగ్గరికి ఉత్తరాలు వ్రాసినవాళ్ళు వ్రాశారు, కొంతమంది పారిపోయి హరిద్వార్‌కి వచ్చేశారు రక్షణగా. తప్పేంలేదు అందులో, మరి సమర్థమైనటువంటి గురువు ఉన్నప్పుడు, మనకి భయం ఉన్నప్పుడు అక్కడికే పోతాం, అది తప్పేంకాదు.

✤ అప్పుడు గురుదేవులు స్పష్టంగా చెప్పారు, ఈ స్కైలాబ్ పడటం వల్ల ఎవడికి ఏ హానీ జరగదు, ఒక దోమ కూడా దాని వల్ల చావదు అని.

నాకు తెలిసి, నేను అప్పుడు యూనివర్శిటీలో రీసెర్చ్ చేస్తున్నాను, గురువుగారి యొక్క శిష్యులలోనే చాలామంది గురువు గార్ని వెక్కిరించారు. అందుకే భారతదేశం ఇలా తగలడిపోయింది, సబ్జెక్ట్ రానటువంటి వాడు, ఎవర్నంటున్నారో అర్థమైందా? గురువు గార్ని అంటున్నారు. సబ్జక్ట్ రానివాడు చెప్తున్నాడు, స్కైలాబ్ పడదుట! అసలు భారతదేశంలోనే పడదు, సముద్రానికి నేను పంపించేస్తాను అంటున్నాడు. అసలు ఆయనకు కాలిక్యులేషన్స్ ఏమైనా వచ్చా, సైన్స్ ఏమైనా చదివాడా ఆయన?

కాని ఏం జరిగిందో మీకు అందరికీ తెలుసు కదా!

✤ 1971 లో బంగ్లాదేశ్ యుద్ధం జరుగుతోన్నప్పుడు కూడా అదే రకమైనటువంటి ప్రమాదం ఏర్పడింది. అప్పుడు కూడా ఆయన చెప్పారు, మీరేం గాబరాపడక్కర్లేదు, ఈ యుద్ధం అదీ ఏమీ జరగదు.

ప్రపంచంలో ఈనాటికీ కూడా అది ఒక వరల్డ్ రికార్డేమో! అన్ని వేలమంది సైనికులు వాళ్ళ యొక్క జనరల్స్‌తో సహా ఆత్మార్పణ చేసుకోవటం. మళ్ళీ జరగలేదది.

✤ మొన్న ఇరాక్‌లో ఏదో జరిగిపోతుంది అనుకున్నారు. అక్కడా ఏం జరగలేదసలు. తుస్సుమంది అక్కడ.

గాయత్రీ మంత్రం యొక్క శక్తి గురించి నేను చెప్తున్నాను, ఆ శక్తిలో భాగముగానే మీకు సాయంత్రము 100 కోట్ల సామూహిక మంత్ర జపముకు సంబంధించిన కార్డ్స్ ఇవ్వబడతాయి. దీని డీటైల్స్ నేను సాయంత్రం చెపుతాను. మనవాళ్ళు, ఇక్కడకు వచ్చిన వాళ్ళు అందరూ కూడా ఇందులో భాగస్వాములే. మీరు ముందే చెప్పాల్సింది మాస్టారు, నాకు కుదరదు అనకండి.

రేపు శ్రావణ మాసంలో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. అంటే ఆగస్ట్‌లోనో ఎప్పుడో పడుతుంది. తరవాత ఇమ్మీడియెట్‌గా కృష్ణా పుష్కరాలు వస్తాయి. అది వచ్చే సంవత్సరం జూన్ నెలలో పడుతుంది. జూన్ నెలలో అంటే గాయత్రీ జయంతికి వస్తుంది.

⇨ చాలా జాగ్రత్తగా వినండి, మిలట్రీ ఎక్కువ ఉండదు. కాని మిలట్రీ చేసినటువంటి పనివల్ల మొత్తం ఆ దేశం బాగుపడుతుంది. అంతేకదా!

➡ చాలాసార్లు మిలట్రీ ద్వారా రక్షణ పొందినటువంటి వ్యక్తులకు అసలు ఆ మిలట్రీ ఎవర్నుంచి రక్షించిందో కూడా తెలీదు. తెలుస్తోంది కదా!

♣ అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ జగద్గురు పీఠంలో అధిరోహించ టానికి మీరు మిలట్రీవాళ్ళలాగ అనంతమైనటువంటి గాయత్రీ మంత్ర జప ఝుంఝూమారుతాన్ని సృష్టించండి! అదీ నా కోరిక.

☺ చప్పట్లు కొట్టరా?

నేనేమో ఇంత పెద్ద మాట ఝుంఝూమారుతం అంటే మీరు చప్పట్లు కూడా కొట్టకపోతే ఎట్లా?

కాని చప్పట్లు కొట్టారు కనుక అది సృష్టించే బాధ్యత కూడా మీదే. ఊపి పారెయ్యండి, అసలు మొత్తము ఆంధ్రప్రదేశ్ అంతా కూడా ఆ గాయత్రీ మంత్రశక్తితో దద్దరిల్లాలి. అరవక్కర్లేదు మీరు, మంత్రశక్తి దద్దరింపచేస్తుంది. దానికి కావలసినటువంటి ఆధ్యాత్మిక శక్తి అశ్వమేధ యజ్ఞం ద్వారా లభించింది మీకు.

✪ ఏ రాష్ట్రంలో అయితే అశ్వమేధ యజ్ఞం జరుగుతుందో, ఆ రాష్ట్రంలో సౌరశక్తి పరిమార్జన, సూర్యుడు యొక్క శక్తిని మీరు ఆకర్షించుకోవటానికి కావలసినటువంటి వాతావరణం ఏర్పడిపోతుంది.

***అంటే ఏమిటి,***

ప్రెసిడెంట్ యుగసైనికులకి మార్చింగ్ ఆర్డర్ ఇచ్చేశాడన్న మాట. ఇప్పుడు సైనికులు వెళతారా, వెనక్కివస్తారా అన్నది రేపు కృష్ణా పుష్కరాల్లో తెలుస్తుంది నాకు.

కానీ మీరు ఇన్నాళ్ళు చాలా బాగా చేశారు, అనుకున్న దానికంటే కచ్చితంగా చాలా బాగా చేశారు.

✦ అనేక మంది గురువులను ఇటు సూక్ష్మజగత్తులోనూ నేను కలిశాను, భౌతిక జగత్తులోనూ కలిశాను. సశరీరంగా ఉన్నటువంటి కొద్ది మంది చాలా గొప్ప గొప్ప గురువులను ఈ మధ్యకాలంలోనే కలిశాను.

⇨ వాళ్ళందరూ ముక్తకంఠంతో మన యొక్క కృషిని మెచ్చుకున్నారు. మన అంటే నా గ్రూప్ సంగతే చెప్పుకుంటున్నాను.

➡ ప్రతీ చోటా అహంకారాలు ఉంటాయి, ప్రతీ చోటా మోహాలు ఉంటాయి. నాకు చాలా పెద్ద పెద్ద మోహాలు ఉన్నాయి. ఎంచేతంటే, ఆధ్యాత్మిక జగత్తు అంటే మోహం ఉండకూడదు అనుకునేటటువంటి గురువు శిష్యుణ్ణి కాదు. నేను కాదు కనుక మీరూ కాదు.

**శ్రీరామశర్మ ఆచార్య ఒక విశేషమైనటువంటి మాట అనేవారు,**

ప్రతీ రోజు రాత్రి ఆయన పడుకునేవారట. అదేంటో తమాషా, ఆయన నిద్రలేచేసరికి తలగడా తడిసివుండేదట. చెప్పింది అర్థమయిందా? ప్రతీరోజు ఆయన పడుకునేవారు, నిద్రలేచేసరికల్లా ఏమయ్యేది? తలగడా తడిసేది. ఎంచేత,

✻ ప్రపంచంలో ఇంతమంది బాధపడుతున్నారే, ఆ బాధపడుతోన్నటువంటి వాళ్ళకి నేను ఏ విధమైనటువంటి సహాయమూ చేయలేనా అని ఆయన రాత్రల్లా ఏడుస్తూ ఉండేవారట.

మరి అలాంటి గురువు శిష్యులం మనం.

**అంచేత మనం ఏడవకపోయినా, ఏడ్చినట్లు నటిద్దాం.**

## అంచేత బాగా నటించండి!

ఎంత బాగా నటిస్తారు? ఈ కార్డ్స్ చెప్తాయి.

⇨ ఆంధ్రప్రదేశ్‌లో గాయత్రీ మంత్రజపము చేయనటువంటి ఇల్లు ఉండకూడదు. ప్రయత్నం చేయండి.

➡ అసలు నువ్వూ నేనూ ఏ పనీ చెయ్యలేము. కానీ ఆయన చేయగలడు, గురుసత్తా చేయగలదు. కానీ నువ్వు నుంచోవాలి. నువ్వు నుంచోకపోతే ఆయనేం చేస్తాడు?

అర్జునుడులాంటి వాడు బాణాలు వదిలేసి, నేనేం చేయగలను అన్నాడు. ఏం చేయగలను అంటే ఏం లేదు. నుంచొంటే! అంచేత కాస్త విశేషముగా గాయత్రీ మంత్ర జప పరంపర మీరు కొనసాగిస్తూ, మీరేం నేర్చుకోవాలి?

గాయత్రీ మహావిజ్ఞాన్ మూడు భాగాలు.

మా ప్రక్కవాళ్ళ ఇంట్లో ఉన్నాయండి, ఉండండి అడుగుతాను అని అనకండి.

✿ ఋషుల నోట్లోంచి వచ్చేటటువంటి మాటలకు ఒక తమాషా ఉంది. అది నిజం కాకపోయినా వాళ్ళ నోట్లోంచి వస్తే నిజం అయిపోతుందది. ఋషులు యొక్క గొప్పతనం అది.

అంచేత వాళ్ళు ఒకళ్ళుకాదు, గాయత్రీ మంత్రం గురించి వ్రాసినటువంటి అనేకానేక మహానుభావులు, యుగయుగాలుగా ఉన్నటువంటి ఋషులు దగ్గర్నుంచి, నిన్న మొన్నట వచ్చినటువంటి మహానుభావులు అందరూ కూడా ముక్తకంఠంతో చెప్పేది ఏమిటంటే,

❋ గాయత్రియే పరసువేది,
గాయత్రియే కామధేనువు,
గాయత్రియే కల్పవృక్షము.

మరి కనీసం దాన్ని ఇంట్లో పెట్టుకోండి.

గుంటూరుకి హిమాలయాల నుంచి ఒక మహానుభావుడు వచ్చాడు. మీలో చాలా మందికి తెలిసివుండొచ్చు. ఆ మహానుభావుడు దగ్గర పరసువేది ఉంది అని ప్రతీతి. హిమాలయాల నుంచి వచ్చాడాయన, చాలా గొప్పవాడు, ఆయన దగ్గర పరసువేది ఉందిట అని అందరూ అనుకునే వారు.

తెలుసా, మీరు విన్నారా ఎవరి గురించి చెప్తున్నానో? ఇక్కడ గుంటూరువాళ్ళు ఉన్నారుగా! సరే, చెప్తే తెలుస్తుందేమో!

పరసువేది ఉంది అని ప్రతీతి. ఇంజనీర్సు, డాక్టర్సు వాళ్ళు ఆయన చాలా మంచివాడు, అబద్ధాలు చెప్పడాయన అని ఆయన మీద నమ్మకంతో, "ఏమండీ మీ దగ్గర పరసువేది ఉందా?" అవునండీ ఉంది. "చూపిస్తారా?" అదిగోనండి, ఆ ఇనప్పెట్టెలో పెట్టాను, చూసుకోండి అనేవాడు. రెండడుగులు వేసేవారు వాళ్ళు. వద్దొద్దు, మీకు పరసువేదిని చూసే అర్హత లేదు, వెళ్ళకండి అనేవాడు.

ఇలాగ ఐదారు నెలలు జరిగింది. భలే పిచ్చాయనాయన, ఒకసారి చూడండి అంటాడు, ఒకసారి చూడొద్దంటాడు అనుకునే వారు. ఈలోపల ఒక ప్రొఫెసరుగారు తన పదేళ్ళ కుర్రవాడితో ఆ ఋషి దగ్గరకి వచ్చారు. మళ్ళీ అదే తంతు, "మహాత్మా మీ దగ్గర

పరసువేది ఉందా?'' ఉందయ్యా. "ఎక్కడుంది?'' ఆ ఇనప్పెట్టెలో ఉంది. వెళ్ళాడు చూడటానికి, వెళ్ళకూడదు, నువ్వు చూడకూడదు అన్నాడు. పదేళ్ళ కుర్రవాడు, "ఈయన అబద్ధం చెప్తున్నాడు, ఈయన దగ్గరున్న ఆ ఇనప్పెట్టెలో పరసువేది లేదు, ఏమీ లేదు'' అన్నాడు.

"ష్! పెద్దాయనాయన. అంత గొప్పాయన చెప్తున్నాడు ఇనప్పెట్టెలో పరసువేది ఉందని. తప్పు అలా అనకూడదు నాయనా, నువ్వు చిన్న కుర్రాడివి, నీకేం తెలుసు?'' అన్నాడు.

"తెలుసునో, తెలియదో నాకు తెలియదుకాని, పరసువేది ఉంటే ఇనుము బంగారంగా మారుతుంది అని నేను విన్నాను. ఇనప్పెట్టెలో పరసువేది ఉంది అని ఈయన ఇన్నాళ్ళ బట్టి చెప్తున్నాడు. పరసువేది ఇనప్పెట్టెలో ఉంటే, ఇనప్పెట్టె ఏమవ్వాలి?''

మరి మనకీ తట్టలేదది. ఆ పదేళ్ళ కుర్రవాడికి తట్టింది. నీకు చూసే అర్హత ఉంది నాయనా అన్నాడు ఆ కుర్రవాడిని ఆ మహానుభావుడు. నువ్వెళ్ళి చూడు అన్నాడు. తీశాడు. తీస్తే పరసువేది ఎందులో ఉంది? ఒక సిల్క్ గుడ్డతో లుంగచుట్టి పెట్టబడి వుంది. ఇనుముకి పరసువేదికి కాంటాక్ట్ ఉంటేకదా అది బంగారమవుతుంది.

- అంచేత గాయత్రీ మహావిజ్ఞాన్ పుస్తకాలు తెచ్చి సెల్ఫ్‌లో పెట్టి, చదవరనుకోండి, మరి మీకు కల్పవృక్షము ఉండదు, కామ ధేనువు ఉండదు, పరసువేదీ ఉండదు.

కానీ గురువుల తప్పు కాదది. కచ్చితంగా గురువుల తప్పు కాదది. మనమా పుస్తకాలు తీసి చదివితే చాలు.

- ✦ **పాఠమాత్రేణ సిద్ధ్యంతి** అనేటటువంటి ఒక అద్భుతమైనటువంటి మాట మన ఋషులు చెప్పారు. పఠిస్తే చాలు నాయనా నువ్వు, ఆ వైబ్రేషన్స్, ఆ తరంగాలు మెల్లిమెల్లిగా మెల్లిమెల్లిగా మీకు కావలసినవన్నీ ఇస్తాయి.

అంచేత నేను మీ నుంచి ఏం కోరుకుంటున్నానో అర్థమయిందికదా, మంత్ర జపం, గాయత్రీ మహావిజ్ఞాన్.

- ♣ నా దగ్గరకి వచ్చిన అనేక మంది కోరికలు తీరుతున్నాయి. మరి అందరికీ తీరుతున్నాయా అంటే, సాయి దగ్గర కూడా అందరికీ తీరటం లేదు. నా దగ్గర కోరికల తీరటానికి కారణం ఏమిటంటే, గాయత్రీ మహావిజ్ఞానమే.

- ✤ గాయత్రీ మహావిజ్ఞాన్‌లో మీరు నిష్ణాతులైతే మీ కోరికలూ తీరతాయి, మీ దగ్గరకి వచ్చే వాళ్ళ కోరికలు కూడా తీరతాయి. మీరు ఎక్కడైనా కూర్చుని పిల్లలు లేనివాళ్ళకి పిల్లలు పుడతారు పదివేలు ఇవ్వండి అంటే ఎవరైనా ఇస్తారు. ఇవ్వరా? 25 వేలు ఇస్తారు, లక్షలు ఇచ్చేవాళ్ళు ఉన్నారు.

- ♠ ఇప్పటికే ఆ అద్భుతమైనటువంటి విద్య సమాజంలోకి, ప్రపంచంలోకి వచ్చేసింది.

న్యూ థాట్స్ బుక్స్. కామ్ అనేటటువంటి ఒక వెబ్‌సైట్ ఉంది. కంప్యూటర్‌ని ఉపయోగించుకోగలిగేటటువంటి వాళ్ళు ఎవరైనా ఉంటే, ఈ వెబ్‌సైట్ చూడండి, ఇప్పుడు నేను చెప్తోన్నదంతా అందులో ఉన్నాయి. 16 వేల పుస్తకాలున్నాయి అందులో. ఇప్పుడు

నేను చెప్తోన్నటువంటి విషయాలు ఇంగ్లీషులో ఉన్నాయి. కానీ అక్కడ కూడా సిల్క్ గుడ్డ కట్టేసి పెట్టేశారు. ఎవడికీ తెలియదు అసలు ఆ వెబ్ సైట్ ఉందని. నేను మాత్రం బయట వాళ్ళకి ఎవరికీ చెప్పటం లేదు. మీకు చెప్తున్నాను.

❄ కానీ మీరు ఆ వెబ్‌సైట్ కోసం వెంపర్లాడక్కర్లేదు. గురుదేవులు వ్రాసినటువంటి గాయత్రీ మహావిజ్ఞాన్ మూడు పుస్తకాలు చదివినటువంటి వ్యక్తి కచ్చితంగా రాజర్షి కోవకి వెళ్ళిపోతాడు.

ఋషుల్లో ఉన్నటువంటి తేడాలు మీరు గుర్తుంచుకోండి,

ఋషి
మహర్షి
రాజర్షి
బ్రహ్మర్షి
దేవర్షి

అయిదు స్థితులు ఉన్నాయి. అందులో రాజర్షి స్థితిలోకి వెళ్ళిపోతాం మనమనందరం కూడా. మూడే మూడు పుస్తకాలు. ఎంత సింపులో చూసుకోండి.

**రెండవది ఈ సంవత్సరంలో మిమ్మల్నుంచి నేను అడుగుతోన్నది ఏమిటంటే,**

☝ సంస్కార పరంపరలు తయారుచేసుకోండి. గురుదేవులు అందించిన పుట్టినరోజు సంస్కారం, వివాహదిన సంస్కారం మంత్రాలతో సహా మన పరివార్ వాళ్ళకి అందరికీ వచ్చేయ్యాలి.

⇨ ఆ సంబంధాలు జన్మజన్మాంతరాల వరకూ వెళ్ళిపోతాయి.

వివాహదిన సంస్కారం గురించి చెప్పానుకదా, ముక్కూ మొహం తెలియనటువంటి కుటుంబాలలోని వాళ్ళు ఇద్దరూ అగ్ని ముందు సంస్కారం చేయించుకుంటే, జన్మ జన్మాంతరాలకీ బంధువులు అయిపోతున్నారు. అందులో ఇంకొకటి,

😐 ఆలి వైపు వాళ్లు ఆత్మబంధువులుట! మామూలు బంధువులు కాదు. ఆ సంస్కారం యొక్క గొప్ప.

హిందీలో ఇంకో సామెత ఉంది. ప్రపంచం అంతా ఒక వైపు, భార్య యొక్క తమ్ముడు ఒక వైపు. సామెతలేనమ్మా, అది రైటో, తప్పో నేనేం అనటంలేదు. రైటే అయివుంటాది, లేకపోతే సామెతలు రావుగా! కానీ ఏమిటక్కడ, నేను చెప్పింది అర్థమవుతోందా, సంస్కారాల విలువ గుర్తించండి మీరు. నామకరణ సంస్కారం చేసుకుంటారు.

***నామకరణ సంస్కారం కరెక్ట్‌గా చేసుకుంటే,***

***ఆ నామంలో ఉన్నటువంటి శక్తి మీలో ప్రవేశిస్తుంది.***

రామనామం యొక్క గొప్ప, రామ సంస్కారం యొక్క గొప్ప. వశిష్ఠులవారు, తెలుసుకదా రామాయణం మీకు. ఈ అబ్బాయికి ఏం పేరు పెట్టాలి అని అడిగితే, ఆ సంస్కారం చేసి ఆ పేరు పెట్టాడు. జగద్విఖ్యాతి గాంచాడు.

మనమూ నామకరణ సంస్కారం చేసుకుంటాం. కానీ అది సంస్కారంగా అర్థంకావటం లేదు. అర్థం చేసుకోండి.

నామకరణ సంస్కారము

విద్యారంభ సంస్కారము

వివాహ సంస్కారము

వివాహదిన సంస్కారము

జన్మదిన సంస్కారము

☝ ఈ 5 సంస్కారాలు మంత్రాలతో పాటు మన వాళ్ళకి వచ్చి తీరాలి.

రేపు కృష్ణా పుష్కరాలలో గాయత్రీ జయంతినాడు వేలాది మందికి గాయత్రీ మంత్ర దీక్షలు ఇద్దాం. దానినే ఉపనయన సంస్కారము అంటాం.

కొంచెం మీరు సాహసం చూపించగలిగితే రేపు రాబోయే టటువంటి కృష్ణా పుష్కరాలలో ఒక సహస్రకుండీ యజ్ఞం మనం పెట్టుకుని వేలాది సంఖ్యలో, స్త్రీ, పురుషులతో జాతి, మత, కుల, లింగ, వయోబేధాలు లేకుండా ఉపనయన సంస్కారాలు చేయిద్దాం. నామకరణ సంస్కారాలు చేయిద్దాం. వీలైతే వివాహ సంస్కారాలు చేయిద్దాం. ఇలాగ దీనికి కావలసినటువంటి ఆలోచనా విధానాన్ని మీరు డెవలప్ చేసుకోండి.

నేను అడిగినవి రెండే. గాయత్రీ మంత్ర జపము - గాయత్రీ మహావిజ్ఞాన్, సంస్కారాలు. వీటిని చాలామంది చేత చేయించండి.

మీరు గాయత్రీ మంత్రం చేస్తున్నటువంటి వ్యక్తులుగా గాయత్రీ మహావిజ్ఞాన్‌తో అసంభవాన్ని సంభవం చెయ్యాలి.

⇨ ఆంధ్రప్రదేశ్‌లో 700 సంవత్సరాలు పైబడిన ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. వాళ్ళు ఇష్టపడటంలేదు కనుక వాళ్ళ పేర్లు నేను చెప్పటం లేదు. ఒకాయన మాత్రం ఒప్పుకుంటున్నారు, శివానంద మహరాజ్, వైజాగ్. వాళ్ళకి 700 సంవత్సరాల వయస్సు ఉన్నా, 40 ఏళ్ళ వయస్సులో కనిపిస్తారు.

➡ నేను మిమ్మల్ని ఎంత దూరం తీసుకెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నానో మీకు అర్థమవటంలేదు. మీరు కొంచెము కష్టపడగలిగితే మీ జీవితాలు నెక్స్‌ట్ ఇయర్‌లో మీరు ఊహించలేరు.

☺ ముసలితనం గురించి చెప్తున్నాను. మీరు ముసలివాళ్ళు అయితే ఏంటిట? మళ్ళా పడుచువాళ్ళు అయిపోతారు.

ఇది బావుందిసార్, చేస్తాం అంటే, చేయండి. నాకేం అభ్యంతరంలేదు, కరెక్టే అది. నాకు తెలిసి ఐదుగురు ఉన్నారు. నాకు తెలియకుండా ఇంకా ఎంతమంది మహానుభావులు ఉన్నారో!

(ఇక్కడ ఒకామె పడుచుతనం ఎందుకండీ, దైవసాన్నిధ్యం, మోక్షం కావాలి అన్నారు.)

మీరు అంత గొప్పవాళ్ళు ఏమో నాకు తెలియదమ్మా! నాకు చాలా చిన్న చిన్న కోరికలు ఉన్నాయి. నాకు వందేళ్ళు ఆరోగ్యంగా బ్రతకాలని ఉంది. జీవేన శరదశ్శతం నందామ శరదశ్శతం.

✤ భారతదేశం నాశనం అయిపోవటానికి కారణం మోక్షం లాంటివి చెప్పే గురువులే. ఎవడు చెప్పాడు మీకు జీవించకూడదు అని, మోక్షం అని. ఎందుకు చావటం?

ఆరోగ్యంగా బ్రతకలేని దద్దమ్మలు చావుని కోరుకుంటారు.
అలాంటి దద్దమ్మలు గురువులు అయ్యారు కనుకే
మన జాతిని ఇలా నిర్వీర్యం చేసి పారేశారు.

**మనం ఏమని కోరుకుంటాం?**

స్వస్తిః ప్రజాభ్యః పరిపాలయన్తాం
న్యాయేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తాః సుఖినో భవంతు

కాలే వర్షతు పర్జన్యః పృథ్వీ సస్యశాలినీ
దేశోయం క్షోభ రహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః

సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఃఖ మాప్నుయాత్

**అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః**
**నిర్ధనా సధనా సంతు జీవంతు శరదాం శతం**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

పిల్లలు లేని వాళ్ళకి పిల్లలు కావాలి అని ఈ స్తోత్రము నేను కాదు వ్రాసింది, "ఋషి" వ్రాశాడు. **అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః** - పిల్లలు ఉన్న వాళ్ళకి మనవలు ఉండాలి. **నిర్ధనా సధనా సంతు** - డబ్బు లేనివాళ్ళకి డబ్బు ఉండాలి.

పిల్లలున్నారు, మనవలున్నారు, డబ్బు ఉంది. ఆరోగ్యం లేకపోతే ఎట్టా? అంచేత ఎన్నేళ్ళు బ్రతకాలి?

♠ వంద సంవత్సరాలు ఆరోగ్యంగా బ్రతకాలి అని ఋషి కోరుకుంటే, ఎవరమ్మా నీకు చెప్పింది మోక్షం కావాలని? గంగలో తోసేయ్ అలాంటి గురువుని. నేను మాత్రం అది చెప్పను.

నా గురువు ఎప్పుడూ మోక్షం గురించి మాట్లాడలేదు. "మోక్షమా, అదేంటి?" అన్నాడాయన. మరి మన గురువు అలాంటి వాడు, మనం ఏంచేస్తాం! ఆయన వలలో పడిపోయాం మనం. అంచేత ఇలాంటి భ్రమలు మాత్రం మీరు పెట్టుకోకండి. ఎంచేతంటే,

**మృత్యోర్మా అమృతంగమయ**

**మాకు చావు వద్దు అమృతత్వం కావాలి అనుకునే జాతి మనది. ముక్తి కావాలి అనుకునే జాతి కాదు.**


**ముక్తి ఎప్పుడు కావాలసి వస్తుందంటే,**

వెధవ గొడవ, ఎప్పుడూ ఇంతేనా అన్పిస్తే, అంతేగా! పెళ్ళయిన రెండు సంవత్సరాలు లోపల ఈ మాటలు వచ్చేస్తాయి. వెధవ గొడవ! అయినా చావం. అంచేత వద్దమ్మా, అది తప్పు ఆలోచన.

వందేళ్ళు చాలా హాయిగా, ఆనందంగా మనం బ్రతుకుతూ, ప్రపంచానికి ఈ విద్యను అందజేయటానికి కావలసినటువంటి అమృతత్వ విద్య ఇది. అందుకే గురువుగారు మాకు ఈ క్లాసులు నేర్పుతున్నప్పుడు దీనికి "సంజీవని విద్య" అని పేరు పెట్టారు.

అంచేత ఈ విద్యని మనం నేర్చుకుంటూ, పది మందికీ అందిస్తూ, అందరం హాయిగా ఉండాలని ఆశిస్తూ,

స్వస్తి




విశ్వతశ్చక్షురుత విశ్వతో ముఖో విశ్వతో బాహురుత విశ్వతస్పాత్
సమ్ బాహుభ్యాం ధమతి సమ్ పతత్రైర్ద్యావాభూమీ జనయన్ దేవ ఏకః

ఋగ్వేదము - 10.81.3.

అన్ని వైపుల కళ్ళు, చేతులు, ముఖములు, కాళ్ళు
కలిగిన అద్వితీయుడు అయిన పరమాత్మ
గతిశీలమైన పృథ్విని, ద్యులోకమును
ఏ సహాయము లేకుండా సృజించెను.
వాటిని సమ్యక్ సంచాలన చేసేది ఆయన ఒక్కరే.